వనపర్తి జిల్లా ఏదుల మండలం సింగాయపల్లిలో రోడ్డుపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న రైతులు

సింగాయపల్లిలో రైతుల వంటావార్పు

ఆంక్షలు లేకుండా ధాన్యం కొనాలని డిమాండ్

గోపాల్‌పేట, మే 5 : ఆంక్షలు లేకుండా ధాన్యం కొనాలని వనపర్తి జిల్లా ఏదుల మండలం సింగాయపల్లి రైతులు డిమాండ్ చేశారు. సోమవారం రోడ్డుపై వంటావార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వరి కోతలు ప్రారంభమై నెల కావస్తున్నా ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని ఆరోపించారు. ఇప్పటి వరకు కేవలం రెండు లారీల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని, ఆ లారీల ధాన్యాన్ని దింపకుండా తాలు ఉన్నదని రైస్ మిల్లరు మొండికేయడం సరికాదన్నారు. వడ్లను తూర్పారాబట్టాలని షరతులు పెట్టడంపై మండిపడ్డారు. ఏపీఎం పార్వతమ్మ హామీతో రైతులు ఆందోళన విరమించారు.

కాంటా ఇంకెప్పుడు పెడ్తరు?

- అధికారిని నిలదీసిన రైతులు
- కొనుగోలు కేంద్రం వద్ద మంచినీళ్లు లేవని ఆగ్రహం

నర్సింహులపేట, మే 5 : మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో నెల రోజులుగా కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వడ్లు తేమ శాతం వచ్చినా కాంటాలు పెట్టడం లేదని రైతులు మండిపడ్డారు. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ ఇబ్బందులు పడుతున్నామని, కనీసం తాగునీళ్లు సమకూర్చడం లేదని సోమవారం సీనియర్ ఇన్స్పెక్టర్ యాకూబ్ అలీని నిలదీశారు. చిన్న రైతులను చిన్నచూపు చూస్తూ, పెద్ద రైతుల వడ్లు కాంటాలు పెడుతున్నారని మండిపడ్డారు. హమాలీలు తక్కువగా ఉండటంతో కాంటాలు ఆలస్యం అవుతున్నాయని, వారి సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో పేరుకపోయిన వడ్ల కుప్పలు

నీళ్లు మేమే తెచ్చుకుంటున్నం..

కొనుగోలు కేంద్రం వద్ద వడ్లు కాంటాలు కాక తిప్పలు పడుతున్నం. వడ్లు తేమ వచ్చిందని చెప్పి 10 రోజులు దాటింది. ఇప్పటిదాక కాంటా పెట్టలే. నిలబడేందుకు నీడ లేదు. మంచినీళ్లు పెడుతలేరు. మేమే రూ.50 పెట్టి నీళ్లు కొనుక్కుంటున్నం. సీరియల్ ప్రకారం కాంటాలు పెట్టాలి. రోజుల కొద్దీ ఇక్కడికి వచ్చి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నం.- **భూక్యా రోజా, రైతు, పిచ్చిరాం తండా, మం: నర్సింహులపేట**

- **దొడ్డు వడ్లు కొనాలని రోడ్డెక్కిన రైతులు**

దొడ్డు వడ్లు కొనాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కాన్‌కుర్తిలో సోమవారం రైతులు రోడ్డెక్కారు. దామరగిద్ద మండలానికి చెందిన రైతుల ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గోదాం లేదని, కాన్‌కుర్తికి పంపగా.. అక్కడా రైతులకు నిరాశే ఎదురైంది. దీంతో ధర్నాకు దిగారు. దొడ్డు వడ్లు కొనే ఏర్పాట్లు చేస్తామని డీఎస్‌వో బాల్‌రాజ్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. –దామరగిద్ద

- **రాయిచూర్ హైవేపై రైతుల బైఠాయింపు**

ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ రైతులు సోమవారం నారాయణపేట జిల్లా వడ్వాట్ సమీపంలో రాయిచూర్ హైవేపై మండుటెండలో బైఠాయించారు. ధాన్యం లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ సురేశ్, ఎస్సై అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనాలని అధికారులు మిల్లు యజమానిని ఆదేశించడంతో రైతులు ధర్నా విరమించారు. – మాగనూరు

రైతు మరణాలు ప్రభుత్వ హత్యలే!

- సీఎం, మంత్రే బాధ్యులు
- అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ.. రైతుల సమస్యలపై లేదు
- కొన్నది 24.43 లక్షల టన్నులే
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.. ధాన్యం డబ్బులు 48 గంటల్లో చెల్లించాలి
- రాష్ట్రంలో రూ. 3,500 కోట్ల మేర కుంభకోణం
- రూ.500 కోట్ల బోనస్‌ను విడుదల చేయాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలోని వివిధ కొనుగోలు కేంద్రాల్లో జరిగిన రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే.. సీఎం, వ్యవసాయ శాఖ మంత్రే ఈ మరణాలకు బాధ్యులు.. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటు.. అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సోమవారం సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను పరామర్శించారు. అనంతరం సిద్దిపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతులను ఓదార్చారు. సిద్దిపేటలో మీడియాతో మాట్లాడారు. ధాన్యం కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. జగిత్యాల, మహబూబాబాద్, సిద్దిపేట జిల్లాల్లో నలుగురు రైతులు ప్రాణాలొదిలారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో, కాంటాలు పెట్టడంలో, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో, బోనస్‌ను అందజేయడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, అన్నదాతల ఆవేదనపై లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం డబ్బులు 48 గంటల్లోనే చెల్లిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలు ఉత్త మాటలే అయ్యాయని, 10 రోజులు దాటినా రైతులకు చెల్లించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, కేవలం 24.43 లక్షల టన్నుల ధాన్యమే కొనుగోలు చేసిందని తెలిపారు. వివిధ కారణాలు చెప్పి 5 కిలోల దాకా తరుగు తీస్తుండటం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని పేర్కొన్నారు. పత్తి రైతులను ముంచి సీసీఐ అధికారులతో కలిసి దళారులు రూ.3,500 కోట్ల కుంభకోణం చేశారని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం ఇస్తామన్న ధాన్యం బోనస్ బోగస్ అయిందని, ఈ సీజన్‌లో ఇప్పటివరకు రూ.515.82 కోట్లను రైతులకు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు చెల్లించింది సున్నా అని విమర్శించారు. ఆ బోనస్ సొమ్మును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మరో రెండు రోజులు వర్షాలు

16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 17 జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భిన్న వాతావరణం కొనసాగుతున్నది. పగలంతా మండుటెండ, సాయంత్రానికి అకస్మాత్తుగా మబ్బులు కమ్మి, బలమైనగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ క్రమంలో 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 17 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కొన్నిచోట్ల గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ ఏడాది మే నెలలో ఎండలతోపాటు గతంలో కంటే ఎక్కువ రోజులు వర్షాలు కూడా కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. ఉత్తర, నైరుతి తెలంగాణలో 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో భారీ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.

టార్పాలిన్లు దిక్కులేవు.. గన్నీలు గతిలేవు

- కొనుగోలు కేంద్రాల్లో సమస్యల తాండవం.. వర్షాలతో తడిసిపోతున్న వడ్లు
- కాంటా పెట్టి.. ఎత్తేందుకు 15 రోజులు.. సెంటర్లలోనే రైతుల పడిగాపులు
- తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా కరువు.. నిర్వాహకుల ఇష్టారాజ్యం
- కొనుగోళ్లు నిలిచి.. కడుపు మండి.. రోడ్డెక్కిన రైతులు.. నిరసనలు
- వడ్లెప్పుడు కొంటరని నిలదీత.. ధర్నాలతోస్తంభించిన రహదారులు

హైదరాబాద్, మే 5(నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమస్యల నిలయంగా మారాయి. దాదాపు అన్ని కేంద్రాల్లోనూ సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. వానొస్తే కప్పేందుకు టార్పాలిన్స్ లేవు, ధాన్యం నింపేందుకు గన్నీ సంచులు లేవు, నింపిన బస్తాలు ఎత్తేందుకు హమాలీలు లేరు. ఎత్తిన సంచులు తీసుకెళ్లేందుకు లారీలు లేవు. చివరికి రైతులకు గుక్కెడు మంచినీళ్లు కూడా దొరకని దయనీయ పరిస్థితి. ఈ సమస్యలన్నీ ప్రభుత్వానికి, పౌరసరఫరాల సంస్థ అధికారులకు తెలియనివి కావు. ఆయా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎండకు ఎండి.. వానకు తడుస్తున్న ధాన్యం

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి తోడు అకాల వర్షాలు రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. మొన్నటివరకు వడగండ్ల వర్షాలతో చాలామంది రైతులు పొలాల్లోనే పంట నష్టపోయారు. ఇప్పుడు అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దవుతున్నది. కొన్నిచోట్ల కొట్టుకుపోతున్నది. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాల బారి నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడం రైతులకు కత్తిమీద సాములా మారింది. మరోవైపు, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్స్ అందుబాటులో లేవు. ఈ సీజన్‌లో ప్రభుత్వం టార్పాలిన్స్‌ను సరఫరా చేయడంలో విఫలమైందనే విమర్శలున్నాయి. ధాన్యం కొనుగోళ్లు మొదలై నెలన్నర గడుస్తున్నా అధికారులు టార్పాలిన్స్ సమకూర్చలేదు. ఇప్పుడిప్పుడే టెండర్లు పిలిచి సరఫరా మొదలు పెట్టారు. ఈలోగా రైతులకు జరగాల్సిన నష్టం జరిగిపోతున్నది. ధాన్యం ఎండకు ఎండి, వానకు తడుస్తున్నది.

ఎత్తేందుకు హమాలీలు లేరు.. తీసుకెళ్లేందుకు లారీలు లేవు

ధాన్యం కొనుగోళ్లలో హమాలీలు, లారీల కొరత రైతులను వేధిస్తున్నది. ధాన్యం నింపేందుకు గన్నీ సంచులు కూడా కరువయ్యాయి. ప్రస్తుతం 17.5 కోట్ల గన్నీ సంచులు అవసరం కాగా, 9.45 కోట్ల గన్నీ సంచులు మాత్రమే అందుబాటులో ఉన్నట్టు ప్రభుత్వమే చెప్తున్నది. సకాలంలో గన్నీ సంచులు అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రభావం ధాన్యం కొనుగోళ్లపై పడుతున్నది. కొన్ని కేంద్రాల్లో ఎన్నోకొన్ని గన్నీ సంచులు అందుబాటులో ఉన్నప్పటికీ, అక్కడ ధాన్యం ఎత్తేందుకు హమాలీల కొరత ఏర్పడుతున్నట్టు తెలిసింది. దీనికితోడు లారీల సమస్య కూడా రైతులను ఇబ్బంది పెడుతున్నది. జిల్లాల్లో సరైన సంఖ్యలో లారీలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు రెండు మూడు రోజులకు ఒక లారీ వస్తున్నదని నిర్వాహకులు చెప్తున్నారు. మరోవైపు, మిల్లుల్లో అన్‌లోడింగ్ ఆలస్యం అవుతుండటంతో లారీలన్నీ మిల్లుల్లోనే రెండు మూడు రోజులు నిలిచిపోతున్నట్టు తెలిసింది.

15 రోజులు కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు

ధాన్యం విక్రయించేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తున్నది. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చినప్పటి నుంచి అది మిల్లులో అన్‌లోడింగ్ అయ్యే వరకు పూర్తి బాధ్యత రైతులదే. తాము ధాన్యం తెచ్చినప్పటి నుంచి మిల్లులో అన్‌లోడింగ్ అయ్యేవరకు సుమారు 15-20 రోజులు పడుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో రైతులు ఇతర పనులన్నీ వదిలేసి కొనుగోలు కేంద్రాల్లోనే జాగారం చేస్తున్నారు.

పట్టింపులేని అధికారులు

ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు, అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. కొనుగోలు ఏర్పాట్ల విషయంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలొస్తున్నాయి. వాస్తవానికి, ధాన్యం కొనుగోళ్ల ప్రారంభానికి ముందే అవసరమైన గన్నీ సంచులు, పరికరాలు సమకూర్చుకోవాలి. లారీల కోసం టెండర్లు పూర్తిచేయాలి. కానీ, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత గానీ సౌకర్యాల కల్పనపై దృష్టి సారించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్టీసీలో విభజించు.. పాలించు

- ఒక వర్గం కవాతులో.. మరో వర్గం చర్చల్లో..
- పోరాడుతున్న వారిని పక్కన పెట్టిన మంత్రి
- ఒక వర్గంతోనే మంత్రి పొన్నం చర్చలు
- ప్రభుత్వానికి సహకరించాలని పిలుపు

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదా? కార్మిక సంఘాలను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నదా? అంటే అవుననే అంటున్నారు ఆర్టీసీ కార్మికులు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై పోరాడుతున్న ఒక వర్గం ముందు చెప్పినట్టుగా సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బస్ భవన్ వరకూ భారీ కవాతు నిర్వహించింది. మరో వర్గం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశం కావడం చర్చనీయాంశమైంది. ఆర్టీసీ కార్మికుల కోసం, వారి సమస్యల కోసం, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కోసం, ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించడం కోసం పోరాడే వారిని కాదని.. సమ్మెలో మొదట్నుంచి కలిసిరాని వారితో మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలకు వెళ్లడం ఏంటనే ప్రశ్న అందరి మెదళ్లను తొలిచివేస్తున్నది. విభజించు, పాలించు ద్వారా ప్రభుత్వమే స్వయంగా సమ్మె నిర్వీర్యానికి పూనుకున్నట్టు ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్టీసీ సమ్మెపై ఇంటెలిజెన్స్ నిఘా

కొన్ని కార్మిక వర్గాలను అనుకూలంగా మార్చుకోవడంతో సమ్మె దాదాపు 50 శాతం నిర్వీర్యమైనట్టేనని ప్రభుత్వం భావిస్తున్నది. దీనికి తోడు ఏ స్థాయిలో సమ్మె జరగబోతున్నదోనని ఇంటెలిజెన్స్ ద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నట్టు తెలిసింది. సమ్మెకు వచ్చిన వారిని తొలగిస్తామని ముందుగానే బెదిరిస్తే మరింత మంది సమ్మెకు రాకుండా ఉంటారనే ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ ప్రస్తుతం ఉన్న సంఘాలు సమ్మెకు వెళ్లినా ప్రభుత్వం ఆశించినంత ప్రభావం ఉండబోదని ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం అందిందట. దీంతో, సమస్యలపై చర్చించేందుకు ఇటు ఆర్టీసీ యాజమాన్యం, అటు ప్రభుత్వం కూడా నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. కార్మిక సంఘాల జేఏసీ నేతల ప్రధాన డిమాండ్ యూనియన్లను పునరుద్ధరించడం. ఇది చేస్తే ప్రతిదానికి సంఘాల నుంచి ప్రతిఘటన తప్పదనే ధోరణిలో యాజమాన్యం ఉన్నట్టు తెలిసింది. ఇక ఈ సమ్మెకు ఎలాంటి సంబంధం లేకపోయినా 'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్టు సమస్యలు పరిష్కరించడం చేతగాక.. ఆ నెపాన్ని కూడా బీఆర్ఎస్ మీద నెట్టేసేందుకు ప్రభుత్వం కుయుక్తులు పన్నుతున్నట్టు తెలిసింది.

ఆర్టీసీ కార్మిక జేఏసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో కవాతు నిర్వహిస్తున్న నేతలు, కార్మికులు

మంత్రితో చర్చల సారాంశం ఇదీ..

ఆర్టీసీ జేఏసీ చైర్మన్ టీఎంయూ జనరల్ సెక్రటరీ అశ్వత్థామరెడ్డి, ఎన్ఎంయూ జనరల్ సెక్రటరీ నరేందర్, కార్మిక సంఘ జనరల్ సెక్రటరీ ఎర్ర స్వామికుమార్, ఎస్టీఎంయూ జనరల్ సెక్రటరీ పున్న హరికృష్ణ, పలువురు ఆర్టీసీ సంఘాల నేతలు కలిసి సమస్యలను మంత్రి పొన్నం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'ఆర్టీసీ సమస్యలపై ఎప్పుడైనా నన్ను కలిసి సమస్యలు చెప్పుకోవచ్చు. మీకు ఎప్పుడు అందుబాటులోనే ఉంటా. ఆర్టీసీ సమస్యలు వినడానికి నేను, మా ముఖ్యమంత్రి కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. సమ్మె చేయవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్న. మీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటా. ఆర్టీసీకి 16 నెలలుగా ఎంతో మంచిచేశాం. సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారు. గత పదేండ్లలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారు. 2017 పే స్కేల్ 21 శాతం ఇచ్చింది మేమే. సంవత్సరానికి రూ.412 కోట్లు భారం పడుతున్నా ఇస్తున్నాం. పీఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.1,039 కోట్లు చెల్లించాం. నెలవారీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుంచి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. సీసీఎస్ బకాయిలు ఉద్యోగులకు రూ.345 కోట్లు చెల్లించాం. 3,038 మంది ఉద్యోగులను రిక్రూట్‌మెంట్ చేయడానికి అనుమతి తీసుకున్నాం' అని చెప్పారు. అయితే. ఆర్టీసీలో ప్రభుత్వ విలీనం.. ఆర్టీసీ యూనియన్ల పునరుద్ధరణ, 2021 పీఆర్సీ ఎరియర్స్‌పై ఒక్క మాట కూడా మాట్లాడలేదని తెలిసింది.

సమ్మెకు దిగితే ఎస్మా తప్పదు!

- సమ్మె యోచనను విరమించుకోండి
- కార్మికులకు యాజమాన్యం హెచ్చరిక

హైదరాబాద్, మే 5 (నమస్తేతెలంగాణ): 'టీజీఎస్ ఆర్టీసీలో ఎస్మా చట్టం అమలులో ఉన్నది.. ఈ చట్టం ప్రకారం సమ్మెలు నిషేధం.. సంస్థ నిబంధనల మేరకు చట్టవ్యతిరేకమైనది.. సమ్మె పేరుతో ఉద్యోగులను ఎవరైనా బెదిరించినా, విధులకు ఆటంకం కలిగించినా బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తప్పవు' అని ఆర్టీసీ యాజమాన్యం హెచ్చరికలు జారీచేసింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెను నిలువరించే లక్ష్యంగా సంస్థ యాజమాన్యం ఎస్మా బలప్రయోగం విధించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఆర్టీసీ యాజమాన్యం పేరుతో సోమవారం సాయంత్రం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ఆర్థికంగా ఇబ్బందులున్నా, ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీని 21 శాతం ఫిట్‌మెంట్‌తో 2024 మే నెలలో యాజమాన్యం అందించిందని సంస్థ పేర్కొన్నది. పెండింగ్‌లో ఉన్న 10 డీఏలను 2019 నుంచి దశలవారీగా విడుదల చేసినట్టు తెలిపింది. ఆర్పీఎస్-2013 బాండ్లకు సంబంధించిన రూ.280 కోట్లను చెల్లించినట్టు వెల్లడించింది. గత మూడున్నరేండ్లుగా ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలను ఇస్తున్నట్టు తెలిపింది.

అశ్వత్థామరెడ్డి ఆర్టీసీ కార్మిక ద్రోహి

- 7న కార్మికులంతా సమ్మెలో పాల్గొనాలి
- తెలంగాణ ఆర్టీసీ జాక్ నేతల ప్రకటన

హైదరాబాద్, మే 5 (నమస్తేతెలంగాణ): టీజీఎస్ఆర్టీసీ జేఏసీ పేరుతో సమ్మె విచ్ఛిన్నానికి పాల్పడేందుకు యత్నిస్తున్న అశ్వత్థామరెడ్డి ఆర్టీసీ కార్మిక ద్రోహి అని తెలంగాణ ఆర్టీసీ జాక్ నేతలు ధ్వజమెత్తారు. ఈ నెల 6న అర్ధరాత్రి నుంచి సమ్మె తప్పదని, సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చింది. సోమవారం సాయంత్రం ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో-చైర్మన్ హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, బీ యాదగిరి మీడియాతో మాట్లాడారు. టీజీఎస్ఆర్టీసీ జేఏసీ పేరుతో అశ్వత్థామరెడ్డి.. సమ్మెకు దూరంగా ఉంటున్నామని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2019లో లోపాయికారి ఒప్పందంతో ఆర్టీసీ ఉద్యోగులను, ఆర్టీసీని అశ్వత్థామరెడ్డి సర్వనాశనం చేశాడని విమర్శించారు. అలాంటి కార్మిక ద్రోహి మాటలను ఎవ్వరూ నమ్మవద్దని హితవు పలికారు. 7న జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఉద్యోగుల విలీనం, ఇతర సమస్యలను ఐక్యంగా సాధించుకోవాల్సిందేనని స్పష్టంచేశారు. కార్మికులు అయోమయానికి గురికాకుండా సమ్మెలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక హక్కులను ప్రభుత్వానికి తాకట్టుపెట్టిన అశ్వత్థామరెడ్డి వంటి ద్రోహులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

బిగ్‌బాస్‌షోను బ్యాన్ చేయండి

హైకోర్టులో సీపీఐ నారాయణ పిటిషన్

హైదరాబాద్, మే 5(నమస్తే తెలంగాణ): బిగ్‌బాస్ రియాలిటీ షోను బ్యాన్ చేయాలంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. అనంతరం నారాయణ మాట్లాడుతూ పలుసార్లు బిగ్‌బాస్‌షోను బ్యాన్ చేయాలని పోలీస్ స్టేషన్ నుంచి జిల్లా కోర్టు వరకు తిరిగినట్టు చెప్పారు.

పురుష సిబ్బంది ఆప్షన్ ఇవ్వాల్సిందే!

ఎస్సీ గురుకులాల సొసైటీ అల్టిమేటం?

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): బాలికల గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న పురుష సిబ్బంది ఇతర చోట్లకు వెళ్లేందుకు ఆప్షన్ ఇవ్వాల్సిందేనని ఎస్సీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కరాకండిగా తేల్చిచెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రంలోని బాలికల గురుకులాలు, కళాశాలల్లో అన్ని క్యాటగిరీల పోస్టుల్లో మహిళా సిబ్బందినే నియమించాలని, ఆ మేరకు మార్గదర్శకాలను వివరిస్తూ గతంలో ప్రభుత్వం జీవో నంబర్ 1274 జారీ చేసింది. తెలంగాణ సబార్డినేట్ సర్వీస్ నిబంధనల విషయంలోని రూల్ 22 (ఏ) (3) ప్రకారం బాలికల స్కూళ్లు, విద్యాసంస్థల్లోని అన్నిపోస్టుల్లో మహిళా సిబ్బందినే భర్తీ చేయాలని కూడా ఆదేశాలు జారీచేసింది. అయితే ఆ జీవోనను పక్కనపెట్టి గత బదిలీల్లో బాలికల గురుకులాల్లో పురుష సిబ్బందిని సొసైటీయే నియమించింది. తాజాగా మళ్లీ జీవో 1274ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇదే విషయమై 'అడ్డదారిలో ప్రమోషన్లు.. దొడ్డిదారిన బదిలీలు' పేరిట 'నమస్తే తెలంగాణ'లోనూ ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో సొసైటీ నిర్ణయంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళనతో పలువురు సొసైటీ టీచర్లు ఉన్నతాధికారులను సోమవారం కలిసి తమ గోడు చెప్పుకున్నారు.

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
A Navratna Company
టెండర్ కోరుతూ ప్రకటన
జోనల్ మార్కెటింగ్ ఆఫీస్-హైదరాబాద్, 3-6-666, బార్‌వాలి ఛాంబర్స్, స్ట్రీట్ నెం.10, హిమాయత్ నగర్, హైదరాబాద్-500029, (టీఎస్), ఫోన్ నెం.040-29701389
నమోదిత కార్యాలయం: స్కోప్ కాంప్లెక్స్, కోర్-III, 7, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, లోధి రోడ్ న్యూఢిల్లీ-03 CINL 74899DL 1974GOI007417
టెండర్ కోరుతూ ప్రకటన (ఇ-టెండర్)
హైదరాబాద్, తెలంగాణలో జోనల్ ఆఫీస్ (మార్కెటింగ్) కొరకు లాంగ్ టెర్మ్ లీజు ప్రాతిపదికన కమర్షియల్ ఆఫీస్ స్పేస్/ఆవరణ అద్దెకు తీసుకొనుటకు
Ref No.: NFL/ZOHYD/HR/C/720/2025 తేది: 06-05-2024
మెసర్స్ నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (NFL), భారత ప్రభుత్వ రంగ సంస్థ దాని యొక్క జోనల్ ఆఫీస్ (మార్కెటింగ్) కొరకు 03 సంవత్సరాల కాలానికి లీజుపై 5000 నుండి 6000 చ.అ. కార్పెట్ ఏరియా కలిగిన హైదరాబాద్ వద్ద తగిన ఆఫీస్ ఆవరణను అద్దెకు తీసుకోవాలని ఉద్దేశిస్తోంది. టెండర్ డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్ www.nationalfertilizers.com నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు చూడవచ్చును. టెండర్ దాఖలుకు చివరి తేది: 26-05-2025న 17.00 గం.వరకు. టెండర్‌కు ఏదేని సవరణ/అనుబంధం NFL వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రకటించబడును.
జోనల్ మేనేజర్ (హైదరాబాద్)